# ఇచ్చిన హామీలు నెరవేర్చేది సీఎం కేసీఆరే..



వెల్దండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్..
- నేడు వెల్దండలో బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశం

వెల్దండ, అక్టోబర్ 17: బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పింది వందశాతం పూర్తి చేస్తుందని, ఇచ్చిన హామీలను నెరవేర్చేది బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటిలోనూ సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాల్లో లబ్ధి పొందిన వారు ఉన్నారన్నారు. ఏ పార్టీ, ఏ కులం, ఏ మతం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో 13లక్షల మంది ఆడపడుచులకు కల్యాణలక్ష్మి కానుకగా అందించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. సీఎం కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ప్రజలాంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని, ప్రతి పక్షాలు పగటికలలు కంటున్నాయని ఎద్దేవా చేశారు. నేడు వెల్దండ ఏవీఆర్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ మండలస్థాయి విస్తృత స్థాయి సమావేశానికి మండంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూపతిరెడ్డి, సర్పంచులు వెంకటేశ్వర్‌రావు, గోరటి శ్రీను, అంజయ్య, మాజీ ఎంపీటీసీ కడారి కృష్ణయ్య, బాలే మియా, దేవేందర్, ప్రసాద్‌తోపాటు బీఆర్ఎస్ మండల నాయకులు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే మర్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు

## బీఆర్ఎస్‌లో చేరిన సీపీఐ, కాంగ్రెస్ నేతలు

తిమ్మాజిపేట/బిజినేపల్లి, అక్టోబర్ 17 : తిమ్మాజిపేట మండల సీపీఐ కార్యదర్శి ఖాజామైనుద్దీన్ మంగళవారం నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి గులాబీ కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఖాజామైనుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్, స్థానికంగా ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధికి మెచ్చి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు మండలకేంద్రానికి చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జోగు ప్రదీప్, సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బిజినపల్లి మండలంలోని లింగసాలపల్లికి చెందిన నరేశ్‌యాదవ్ మంగళవారం నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాసులు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్, బీఎస్పీల నుంచి..

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 17 : కందనూలు ప్రదాత మర్రి జనార్దన్‌రెడ్డికే మా మద్దతు అంటూ మండలంలోని గన్యాగుల గ్రామస్తుల నినదించారు. మర్రన్న చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై గ్రామానికి చెందిన 35 మంది కాంగ్రెస్, బీఎస్పీ పార్టీలకు చెందిన యువకులు మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కాంగ్రెస్, బీఎస్పీ పార్టీలకు చెందిన యువకులు కె.రామ్‌కుమార్, ఎండీ మాసూమ్, శివకుమార్, రవి, భానుప్రసాద్, శివ, ఎండీ సలాంపాషా, దత్తాత్రేయ, రాజు, బాలరాజు, బాబు, చింరాజ్, రాజు, శ్రీశైలం, కే.శివ, శంకర్, రామకృష్ణ, సాంబశివుడు, రాజు, శివకుమార్, పి.రాము, సురేందర్ నర్సింహ, బాలయ్య, నర్సింహ, రాజశేఖర్‌తోపాటు 35 మంది యువకులు ఆయా పార్టీలకు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి మెచ్చి వివిధ పార్టీలకు చెందిన నాయకులు కారెక్కుతున్నా రన్నారు. అందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి : ఎంపీ



పాదయాత్రలో పాల్గొన్న సంఘీభావం తెలుపతున్న ఎంపీ రాములు

అచ్చంపేటరూరల్, అక్టోబర్17 : కేంద్రప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చేపట్టిన మాదిగల విశ్వరూప మహాపాదయాత్ర మంగళవారం తలకొండపల్లికి చేరుకొగా ఆయనకు మద్దతుగా పాదయాత్రలో ఎంపీ రామలు పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందని తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీతో తీర్మానం చేసి కేంద్రాని లేఖ పంపించినా స్పందించడం లేదని ఆయన ఆరోపించారు.

## చంద్రఘంటాదేవీగా భ్రామరి దర్శనం



శ్రీశైలం, అక్టోబర్ 17 : శ్రీశైలంలో దసరా మహోత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం భ్రమరాంబాదేవి చంద్రఘంటాదేవీగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆది పరాశక్తుల్లో తృతీయరూపిణి అయిన చంద్రఘంటాదేవి యుద్ధోన్ముఖురాలై సింహవాహనాన్ని అధిష్టించి భక్తులకు దర్శనమివ్వగా చంద్రఘంటా సమేతుడైన శ్రీశైలేశుడు రావణ భుజ స్కంధాలపై విహరిస్తూ భక్త జనాన్ని అలరింపజేశాడు. ఈవో పెద్దిరాజు ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చనలు, నవవరణార్చన, జపానుష్టపారాయణ, చతుర్వేద పారాయణాలు, చండీ, దుర్గ, కాళి, లలితార్చనలు, కు మారి పూజలు చేశారు. అదేవిధంగా స్వామివారికి రుద్రహోమం, రుద్రయాగాంగ జపములు, రుద్రపారాయణాలు చేశారు. మధ్యాహ్నకాలార్చన, సహస్రనామార్చన, మహానివేదన అనంతరం సాయంకాలం జపానుష్టానాలు నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు శివప్రసాద్, మార్కండేయ శర్మ తెలిపారు.

# స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్
- సోషల్ మీడియాపై పటిష్ట నిఘా
- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



ఎన్నికల నిర్వహణపై చర్చిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 17 : స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. నాగర్‌కర్నూల్ ఎస్పీగా ఈనెల 16న బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తొలిసారిగా మంగళవారం ఉదయం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం ఇరువురు అధికారులు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లోని 793 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు సమర్థవంతంగా ప్రశాంత వాతావరణంలో నిర్వర్తించేలా చూడాలని నూతన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను కలెక్టర్ ఉదయ్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగానికి శిక్షణతోపాటు మొదటి విడుత తనిఖీలు పూర్తిచేసి ఈవీఎంలను సంసిద్ధం చేసినట్లు చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయటంతోపాటు గతం కన్నా ఈసారి పోలింగ్ శాతం ఎక్కువ నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్, వీడియో ఫ్లయింగ్ స్క్వాడ్స్, నోడల్ అధికారులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు ఏర్పాటు చేయడంతోపాటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు.

### సోషల్ మీడియాపై పటిష్ట నిఘా

కేంద్ర ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో ముందుకు వెళతామని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాపై పటిష్ట నిఘా ఉంటుందని, అందరూ గుర్తుంచుకోవాల్సిన అంశమన్నారు. జిల్లాలోఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ విద్వేషాలకు పాల్పడవద్దని, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించరాదని, రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు 100మీటర్ల పరిధిలో నిర్వహించరాదని పేర్కొన్నారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేయడం, తప్పుడు ప్రచారాలు చేసే వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం 1951సెక్షన్ 123, ఐపీసీ సెక్షన్ 171ప్రకారం అభ్యర్థులపై ఆరేండ్ల నిషేధం ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీల నిర్వహణ కోసం సువిధ యాప్ ద్వారా ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని, 24 గంటల్లోగా దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఒకేప్రాంతంలో ఒకే సమయంలో ఎక్కువమంది సమావేశాలు నిర్వహణకు పోటీపడితే ముందు దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం కల్పిస్తామన్నారు. జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వీవీఐపీలు, వీఐపీల పర్యటన సమయంలో స్థానిక పోలీస్ అధికారులతో పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు, ముఖ్య అతిథులకు ఇబ్బందులు కలగకుండా సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు.



బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

## అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై..

ఊర్కొండ, అక్టోబర్ 17 : మండలంలోని ఊర్కొండపేటకు చెందిన బీజేపీ మాజీ ఉపసర్పంచ్ పోలే యాదయ్యతోపాటు బీజేపీ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన 30 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకుడు జహంగీర్, ఊర్కొండపేట మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం జడ్చర్లలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అభివృ ద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్ లో చేరుతున్నారని పేర్కొన్నారు. నేడు జడ్చర్లలో నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభకు మండల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

## పోలీసుల తనిఖీలు : రూ.10 లక్షలు సీజ్

వంగూరు, అక్టోబర్ 17 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై శ్రీశైలం చౌరస్తా వద్ద ఎస్సై కురుమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి అచ్చంపేట వైపు వస్తున్న ఆరు కార్లలో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న రూ.10 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 వేల లోపు నగదును అత్యవసరమైతే తప్పా ఎలాంటి పత్రాలు లేకున్నప్పటికీ వారికి అప్పగించవచ్చని కానీ రూ.50 వేల కంటే అధిక మొత్తంలో వుండే నగదుకు కచ్చితంగా ఆధారాలు చూపించాలన్నారు. లేని ఏడల వాటిని సీజ్ చేస్తామని ఎస్సై పేర్కొన్నారు.